సాక్షి
విజయనగరం

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



బంగారు కొండలు

కొండవెలగాడ గ్రామం వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఖిల్లాగా మారింది. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. - IIలో



'జగనన్నకు చెబుదాం'కు 255 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం'కు ప్రజల నుంచి 255 వినతులు అందాయి. - IIలో



బేబీ-2 సినిమా పోస్టర్ ఆవిష్కరణ

గజపతినగరం: గజపతినగరం సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం బేబీ-2 సినిమా రెండవ పోస్టర్‌ను విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఆకుపై భారతదేశ చిత్రపటం



కరివేపాకుపై భారతదేశ చిత్ర పటం, మధ్యలో గాంధీజీ

రాజాం సిటీ: పట్టణ పరిధి కస్పావీధికి చెందిన మైక్రో ఆర్టిస్టు, స్వర్ణకారుడు ఎం.జగదీష్ కరివేపాకుపై భారతదేశ చిత్రపటం, మధ్యలో గాంధీ చిత్రాన్ని చెక్కి తన ప్రతిభ నిరూపించుకున్నాడు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 60 నిమిషాల వ్యవధిలో సూక్ష్మభారతదేశం చిత్రాన్ని కరివేపాకుపై చెక్కినట్టు తెలిపాడు.

ఐదుగురికి ఉద్యోగోన్నతి

- నియామకపత్రాలు అందజేసిన జెడ్పీ చైర్మన్



ఉద్యోగోన్నతి నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ పరిధిలో ఐదుగురు ఉద్యోగులకు రికార్డు అసిస్టెంట్లుగా నియమిస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం జెడ్పీ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించి, ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



కాలిపోతున్న ద్విచక్ర వాహనం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని చంద్రంపేట జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం ఓ ద్విచక్రవాహనం అగ్నికి ఆహుతైంది. స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రంపేట వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం నుంచి పెట్రోల్ లీకవ్వడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో వాహనచోదకుడు భయంతో వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. క్షణాల్లో వాహనం కాలిబూడిదైంది. ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ ఆశయం

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వా రా గ్రామ స్వరాజ్య స్థాపనే ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానే టి వనిత అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా చినబొండపల్లిలో రూ.42 లక్షల ఖర్చుతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయం వ్యవ స్థతో వివిధ ప్రభుత్వ సేవలను ఇంటిముంగిటకే చేర్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేన ని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందాయన్నారు. పేదలకు మంచి చేయాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. అంతకు ముందు గ్రామ సచివాలయ భవనానికి స్థలాన్ని అందించిన దాతలను సత్కరించారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- విజయనగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహణ
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ఇన్‌చార్జి మంత్రి బూడి
- కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక ఏర్పాట్ల పరిశీలన
- ప్రజల సందర్శనకు వీలుగా విజయనగరంలో శకటాల ప్రదర్శన
- విద్యుత్‌దీపాల అలంకరణలో కలెక్టరేట్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడే రోజు రానేవచ్చింది. జెండా పండగకు సర్వం సిద్ధమైంది. 77వ స్వాతంత్ర దినోత్సవాలకు విజయనగరంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రజలనుద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని వినిపిస్తారు. వివిధ ప్రభుత్వ విభాగాల శకటాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసుల గౌరవ వందన కార్యక్రమాలు ఆహూతులను అలరించనున్నాయి. ఇక స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రంగురంగుల కాంతులతో కలెక్టరేట్ ధగధగలాడుతోంది.

ఉన్నతాధికారుల పరిశీలన...

పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాలకు ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో గణపతిరావు తదితర ఉన్నతాధికారులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. వేదిక, స్టాల్స్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, మత్స్య, ఉద్యాన, సర్వే–భూ రికార్డులు, చేనేత, జౌళి, జిల్లా నైపుణ్యాభివృద్ధి, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక, సాంఘిక సంక్షేమ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సెట్విజ్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలు ఈ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. వాటిలో శాఖాపరంగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ప్రదర్శించనున్నారు. ఇక వ్యవసాయ, ఉద్యానశాఖలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, నీటి యాజమాన్య సంస్థ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఏపీఎంఎస్ఐడీసీ, గ్రామీణ నీటిసరఫరా శాఖ, గృహనిర్మాణ శాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, అటవీ శాఖ, విద్యుత్తు శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, పోలీస్, అగ్నిమాపక శాఖల శకటాలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ కానున్నాయి. వాటికి కేటాయించిన నంబర్ల ప్రకారం నడిపించాలని, అత్యుత్తమంగా ఉన్న వాటికి బహుమతులను ఇచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులకు సూచించారు. వారి వెంట ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, విజయనగరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, ఎస్‌డీసీలు బి.సుదర్శనదొర, డి.వెంకటేశ్వరరావు, విజయనగరం మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు ఉన్నారు.



విద్యుత్ కాంతులతో దర్శనమిస్తున్న కలెక్టరేట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, జేసీ, డీఆర్వో, ఆర్డీఓ తదితరులు



స్వాతంత్ర్య వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముస్తాబైన వేదిక



గరుగుబిల్లిలో 400 మీటర్ల జాతీయపతాకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మువ్వన్నెల ముచ్చట

మెరకముడిదాం: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా మెరకముడిదాం మండలం గరుగుబిల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 400 మీటర్ల పొడవుగల జాతీయపతాకంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని పెంపొందించారు. మువ్వన్నెల జెండా గొప్పతనాన్ని గ్రామస్తులకు వివరించారు. హెచ్‌ఎం ఎస్.వి.రమణరావు ఆధ్వర్యంలో సాగిన ర్యాలీలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరంలో శకటాల ప్రదర్శన...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పరేడ్ మైదానంలో ప్రదర్శన అనంతరం శకటాలు ప్రజల సందర్శనార్థం విజయనగరం పట్టణంలోకి రానున్నాయి. మయూరి జంక్షన్ మీదుగా బాలాజీ కూడలి వరకు శకటాలను ర్యాలీగా తీసుకెళ్లాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు.

వర్షం పడినా అంతరాయం లేకుండా...

విజయనగరంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ దృష్ట్యా ఒకవేళ మంగళవారం వర్షం పడితే కార్యక్రమాన్ని అంతరాయం లేకుండా ఎలా కొనసాగించాలనే విషయమై కలెక్టర్, ఎస్పీలు అధికారులకు పలు సూచనలు చేశారు. మైదానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అతిథులు, ప్రజలు కూర్చొని వేడుకలను తిలకించేందుకు వీలుగా గ్యాలరీల్లో కుర్చీలను ఏర్పాటు చేశారు.

గాంధీజీకి గుడి..



రాజాం: రాజాం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న శెగిడి వీధి వాసులు 1996లో జాతిపిత మహాత్మాగాంధీజీకి గుడికట్టారు. ఆ వీధికి గాంధీ వీధిగా నామకరణం చేశారు. యువతలో దేశభక్తిని పెంపొందిస్తున్నారు. దొంతంశెట్టి రమణ, పైడిరాజు, డి.మల్లయ్య తదితరుల సాయంతో వెలసిన గుడిలో ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.





బొబ్బిలి: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా దేశనాయకుల వేషధారణలో బొబ్బిలి పట్టణలోని 1, 16, 18 వార్డుల అంగన్‌వాడీ పిల్లలు

వీరులకు సత్కారం



వీరులను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎంపీ

చీపురుపల్లిరూరల్(గరివిడి):గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నా దేశం..నాభూమి, వీరులకు వందనం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. దేశ రక్షణలో నిమగ్నమైన సైనికులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సత్కరించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, కొండపాలేం మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.ప్రమీల, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, బమ్మిడి అప్పలస్వామి, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, పొన్నాడ కుమార్, ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఎంఈఓ పి.రామారావు, హెచ్‌ఎం లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

జయహో.. భారత్



విజయనగరం టౌన్: దేశ సమైక్యతను చాటుతూ విద్యార్థులు, కళాకారులు విజయనగరం పట్టణంలో సోమవారం నిర్వహించిన ర్యాలీ దేశభక్తిని చాటింది. ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా జాతి ఔన్నత్యాన్ని కీర్తిస్తూ, జాతీయస్ఫూర్తిని చాటుతూ మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ర్యాలీ ను నిర్వహించాయి. సంగీత, నృత్య కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ సింహాచలం మేడ, కోట కూడలి, గురజాడ స్వగృహం, గురజాడ జంక్షన్ మీదుగా సాగింది. ర్యాలీలో మువ్వన్నెల జెండాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తాచూపారు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ త్రినాథ్‌రావు

కొత్తవలస: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కొత్తవలస మండలానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చూపారు. పోటీల్లో పాల్గొన్న 25 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో 24 బంగారు, 11 సిల్వర్, 11 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

విద్యార్థులను స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుధీర్‌బాబు, శిక్షకులు వై.వెంకటలక్ష్మి, ఎస్.లలితకామేశ్వరి, ఎం.చాందిని, కోచ్ ఎం.త్రినాథ్‌రావు అభినందించారు.

5 సర్పంచ్ స్థానాలకు పోటీ

- ఏకగ్రీవమైన లోగిశ సర్పంచ్ స్థానం, మరో 43 వార్డులు
- 19న ఉప ఎన్నికల నిర్వహణ

విజయనగరం రూరల్: జిల్లాలోని ఐదు పంచాయతీలకు ఈ నెల 19న ఉపఎన్నికలు షురూ అయ్యాయి. జిల్లాలోని 6 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 54 వార్డుల ఉపఎన్నికలకు ఎన్నికల సంఘం ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 6 సర్పంచ్ స్థానాలకు 30 నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే, సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన నాటికి ఒకటి ఏకగ్రీవం కాగా ఐదు సర్పంచ్ స్థానాలకు 10 మంది బరిలో నిలిచారు. గజపతినగరం మండలం లోగిశ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒకటే నామినేషన్ మిగలగా కె.అనూష ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. గంట్యాడ మండలం పెంట శ్రీరాంపురం, విజయనగరం మండలం పడాలపేట, పూసపాటిరేగ మండలం కొప్పెర్ల, వంగర మండలం ఓని అగ్రహారం, లక్ష్మీపేట సర్పంచ్ స్థానాలకు ఇద్దరేసి అభ్యర్థులు బరిలో నిలవడంతో పోటీ అనివార్యమైంది. జిల్లాలోని 54 వార్డు స్థానాలకు 93 నామినేషన్లు దాఖలు కాగా నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన నాటికి 43 వార్డులు ఏకగ్రీవమై, ఎనిమిది వార్డులకు 17 మంది బరిలో నిలిచారు. వేపాడ మండలం జగ్గయ్యపేట పంచాయతీ పరిధిలోని ఒక వార్డు నుంచి అభ్యర్థులందరూ నామినేషన్లు ఉపసంహరించుకోవడం అక్కడ ఎన్నిక నిర్వహించే అవకాశం లేదు. ఈ నెల 19న 5 గ్రామ సర్పంచ్ స్థానాలకు, 8 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

ఇక పర్యాటక బొబ్బిలి

- రూ.2.85 కోట్లతో పట్టణ సుందరీకరణ
- నాలుగు చోట్ల అభివృద్ధి పనులు
- శంకుస్థాపన చేసిన వెంటనే ప్రారంభం
- బొబ్బిలి వీణ స్వాగత బోర్డు, భైరి సాగరం సుందరీకరణ పనులు షురూ!



సాగుతున్న భైరిసాగరం అభివృద్ధి పనులు

బొబ్బిలి: పర్యాటకంగా బొబ్బిలి పట్టణ అభివృద్ధికి ముందడుగు పడింది. పట్టణ సుందరీకరణ, అమృత్ సరోవర్ తదితర పద్దుల కింద రూ.2.85 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా పట్టణంలోని భైరిసాగరం చెరువు సుందరీకరణ పనులను అధికారులు ప్రారంభించారు. రూ.1.10 కోట్లతో చేపట్టే సుందరీకరణ పనులకు రెండు రోజుల కిందట ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. కెర్బ్‌వాల్, వాకింగ్ ట్రాక్, గ్రావెల్ ఫార్మేషన్, స్టోన్ పిక్సింగ్, ఫెన్సింగ్, ప్లాంటేషన్, విద్యుదీకరణ తదితర పనులు చేపడతారు. అలాగే, వాటర్ ట్యాంకు వద్ద గల రాణి మల్లమ్మదేవి కోనేటిని సుందరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ కూడా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. పక్కనే వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా ఉండడంతో ఈ ప్రాంతం మరింత శోభాయమానం కానుంది. దీనికి రూ.50లక్షలను వ్యయం చేయనున్నారు. కోనేటి వద్ద మెట్లు, పార్కును ఆనుకుని ఉన్న ప్రాంతంలో రక్షణ గోడను నిర్మించి సుందరీకరిస్తారు. మరో పక్క అమ్మిగారి కోనేటి గట్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని ట్రాఫిక్ ఐలాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తారు. వాటర్ ఫౌంటెయిన్‌ను సత్వరం ఏర్పాటుచేస్తారు. దీని కోసం రూ.10లక్షలను వెచ్చించనున్నారు. పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద రూ.1.15 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేయనున్నారు.

పనులు ప్రారంభం..



భైరిసాగరం సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను నిరాటంకంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రూ.1.10 కోట్లతో పనులు ప్రారంభించాం. ఈ నిధులతో చెరువును సుందరంగా, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు చేపడుతున్నాం. – ఎస్.శ్రీనివాసరావు, కమిషనర్, బొబ్బిలి మున్సిపాలిటీ

గతంలో అన్నీ శంకుస్థాపనలే!



గత ప్రభుత్వ హయాంలో పనులు మంజూరుకావడం, కొబ్బరి కాయలు కొట్టి వదిలేయడం జరిగేది. ఇప్పుడు కొబ్బరి కాయ కొట్టామంటే పనులు పూర్తిచేసేవరకు విశ్రమించేదిలేదు. మాటఇస్తే నెరవేర్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ప్రజల సహకారంతో బొబ్బిలి అభివృద్ధి చెందుతోంది.

– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎమ్మెల్యే, బొబ్బిలి

క్లుప్తంగా

పరామర్శకు వెళ్తే పొడిచేశాడు..

- మహిళ పరిస్థితి విషమం



గాయపడిన కిరణ్మయి

సాలూరు: గాయాలపాలైన స్నేహితురాలిని పరామర్శించేందుకు వెళ్లిన ఓ మహిళపై దాడి జరిగిన సంఘటన సాలూరు పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు కిరణ్మయి, తండ్రి ఈశ్వర రావు, స్థానికులు తెలియజేసిన వివరాల మేరకు... పట్టణంలోని చిట్లువీధిలో నివసిస్తున్న లలితకుమారి రామభద్రపురం మండలం తారాపురం యూపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తోంది. ఆమెకు భర్త ప్రసాద్‌తో విభేదాలుండడంతో ఇరు కుటుంబాల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఇటీవల లలితకుమారిపై ప్రసాద్ దాడిచేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న కిరణ్మయి స్నేహితురాలిని పరామర్శించేందుకు సోమవారం లలితకుమారి ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో లలితకుమారి భర్త ప్రసాద్ రావడంతో అతనికి, కిరణ్మయికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సహనం కోల్పోయిన ప్రసాద్ కిరణ్మయి పొట్టపై కత్తితో దాడి చేసాడు. తీవ్ర రక్తస్రావంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిన కిరణ్మయిని స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. పట్టణ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాల రాయళ్ల అరెస్టు

- రూ.12,470 స్వాధీనం

గంట్యాడ: మండలంలోని కొత్త వెలగాడ గ్రామంలో కోడి పందాలు ఆడుతున్న కొంత మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గ్రామంలో కోడి పందాలు ఆడుతున్నట్లు మహిళాపోలీస్ గంట్యాడ పోలీసులకు సమాచారమందించడంతో గ్రామంలో పోలీసులు మాటు వేసి కోడి పందాలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,470, మూడు కోండి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట ఆడినట్లయితే చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఎరువుల షాపు సీజ్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నంలో గల శ్రీ మణికంఠ రైతు డిపో ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎరువులు, పురుగు మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో రూ.4,20, 832 విలువ చేసే ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు కనిపించడంతో షాపును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం, ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న పోలినాయుడు

పార్వతీపురం: సీతానగరం మండలం జోగింపేటకు చెందిన జాగాన పోలినాయుడు గుట్కాలు తినడం కారణంగా నోట్లో పుండ్లు ఏర్పాడ్డాయి. అలాగే ముఖం అందవికారంగా ఉందని భావించి మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాలపడ్డాడు. ఈ విషయం భార్య ఆదిలక్ష్మి గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి 108 వాహనం ద్వారా చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బెదిరించేందుకు మహిళ..



చికిత్స పొందుతున్న అపర్ణ

పార్వతీపురం: కుటుంబసభ్యులను బెదిరించేందుకు సీతానగరం మండలం గుచ్చిమి గ్రామానికి చెందిన మండల అపర్ణ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త రామకృష్ణ, అత్తమ్మ చూస్తుండగానే వారిని భయపెట్టేందుకు ఇంట్లో ఉన్న మాత్రలు ఒక్కసారిగా మింగేసింది. దీంతో కుటుంబసభ్యులు ఆటోలో ఆమెను చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బంగారు కొండలు

వల్లూరి శ్రీనివాసరావు, మత్స సంతోషి, శనపతి పల్లవి, గురునాయుడు, బెల్లాన హారిక, చుక్కా శ్రీలక్ష్మి, వల్లూరి అజయ్‌బాబు... ఈ పేర్లు వింటేనే చాలు.. మనకు వెంటనే గుర్తుకొచ్చేది కొండవెలగాడ. నెల్లిమర్లకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామం క్రీడల ఖిల్లాగా భాసిల్లుతోంది. స్థానికంగా శిక్షణ పొందిన పదుల సంఖ్యలో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండిస్తున్నారు. రాష్ట్రానికి, జిల్లాకు, గ్రామానికి వన్నెతెస్తున్నారు. క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధిస్తూ యువతకు స్ఫూర్తి మంత్రం వినిపిస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడకు కేరాఫ్‌గా మారిన కొండవెలగాడ గ్రామం, అక్కడి కోచ్‌ల శిక్షణ, క్రీడాకారుల కఠోర సాధనకు 'సాక్షి' అక్షరరూపం.

- క్రీడల ఖిల్లాగా కొండవెలగాడ
- వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న గ్రామ, పరిసర గ్రామాల యువత
- శిక్షకుల ఆధ్వర్యంలో కఠోర సాధన
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట
- క్రీడా కోటాలో ఉద్యోగాల సాధన



కొండవెలగాడలో సాధన చేస్తున్న వెయిట్‌లిఫ్టర్లు (ఫైల్)

విజయనగరం డెస్క్: కొండవెలగాడ... ఈ గ్రామం పేరు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే వెయిట్‌లిఫ్టింగ్ క్రీడావేదికలపై తరచూ వినిపిస్తుంది. పోటీ ఏ స్థాయి అయినా సరే... ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు తలపడతారు. పతకాలు సాధిస్తారు. మొదటిగా వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము సమక్షంలో రాటుదేలిన చల్లా అన్నపూర్ణతో ప్రారంభమైన పతకాల సాధన నిర్విరామంగా కొనసాగుతోంది. సుమారు 40 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో పతకాలు సాధించగా, మరో 8 మంది క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై అదరహో అనిపిస్తున్నారు. ఇటీవల జరిగిన ఏసియన్, కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు, సిల్వర్, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

కఠోర సాధన..

కొండవెలగాడకు వెళ్లేవారికి... వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో సాధన చేస్తున్న 8 ఏళ్ల వయస్సు నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న యువతీయువకులు కనిపిస్తారు. ఉదయం నుంచి నిద్రపోయేవరకు సాధన ధ్యానంలోనే నిమగ్నమవుతారు. శిక్షకులు చెప్పిన మెలకువలను ఔపోసన పడతారు. కఠోర సాధన చేస్తారు. అందరి కంటే అధిక బరువు ఎత్తగలమన్న ఆత్మస్థైర్యం వీరిలో నిండుగా కనిపిస్తుంది. అదే వీరి విజయరహస్యం.

కలాసీ పిల్లలే...


వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న క్రీడాకారుల్లో అధిక మంది స్థానిక మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న కలాసీల పిల్లలే. పల్లవి తండ్రి లక్ష్మునాయుడు, గురునాయుడు తండ్రి రామస్వామి, హారిక తండ్రి శ్రీనివాసరావుకు కలాసీ పనే ప్రధాన వృత్తి. వీరంతా తమ పిల్లలను వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో ప్రోత్సహిస్తుండం, స్థానికంగా లభించే ఉత్తమ శిక్షణతో క్రీడలో రాటుదేలుతున్నారు. దేశ, అంతర్జాతీయ వేదికలపై కొండవెలగాడ పేరును ఇనుమడింపజేస్తున్నారు.

క్రీడా ప్రస్థానం మొదలైందిలా...

విజయనగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో 1994వ సంవత్సరంలో జూనియర్ నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. వాటిని చూసేందుకు పోలియో బాధితుడు, కొండవెలగాడకు చెందిన చల్లా రాము వెళ్లారు. ఆడపిల్లలు క్రీడలో చురుగ్గా పాల్గొనడంతో ముందుగా తన చెల్లెలు అన్నపూర్ణను శర్మ అనే కోచ్ వద్ద చేర్పించారు. చెల్లెలితో వెళ్తూ రాము కూడా ఆటలో మెలకువలను ఔపోసన పట్టారు. చెల్లెలి శిక్షణకు ఇతోధికంగా సాయపడేవారు. శిక్షణలో రాటుదేలిన అన్నపూర్ణ 1995, 96, 97 సంవత్సరాల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో నేషనల్ చాంపియన్‌గా నిలిచింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకున్న యువత రామువద్ద శిక్షణకు చేరారు. అంతే.. 2005లో గ్రామంలోనే జిమ్‌ను ఏర్పాటుచేయడంతో యువత సాధనకు వీలుపడింది. గ్రామమంతా వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు కేరాఫ్‌గా మారింది. 2005 నుంచి నేటి వరకు వెయిట్‌లిఫ్టింగ్‌లో విజయపరంపర కొనసాగుతోంది. కొండవెలగాడతో పాటు విజయనగరం, అయ్యన్నపేట, నెల్లిమర్ల, ఒంపిల్లి తదితర గ్రామ యువత కూడా క్రీడాసాధనకు గ్రామానికి వస్తున్నారు.

చరిత్రను తరచిచూస్తే..

వాస్తవంగా కొండవెలగాడ గ్రామం రాజుల కొండకు ఆనుకుని ఉంటుంది. సుమారు 5వేలు జనాభా కలిగిన గ్రామం చైతన్యవంతమైనది. రాజుల కాలంలో ఇక్కడి కొండపై సైన్యానికి శిక్షణ ఇచ్చేవారట. ఉత్తమ యుద్ధవీరులు ఇక్కడే సిద్ధమయ్యేవారు. ఆ ప్రభావం గ్రామంపై పడిందన్నది పెద్దల మాట. గ్రామ యువతలో పట్టుదల ఎక్కువగా ఉండడం, విజయం సాధించాలన్న కసి, దుందుడుకు తనం నిండుగా కనిపిస్తాయని చెబుతుంటారు.





'అజేయ'ంగా..

వల్లూరి అజయ్‌బాబు 2022 యూత్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2022 జూనియర్ నేషనల్స్‌లో స్వర్ణం, 2022 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో స్వర్ణం, 2023 సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్, 2023 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో స్వర్ణం, 2022 జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో సిల్వర్, 2023 కామన్‌వెల్త్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణం, 2023 ఏషియన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకాలను సాధించాడు.



హారిక అదరహో...

బెల్లాన హారిక 2018 ఐదవ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో సిల్వర్, 2021 అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో సిల్వర్, 2021 అంతర్ జిల్లాల పోటీల్లో రజతం, 2023 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రజతం, 2023 ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్, 2023 కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం, 2023 ఏసియన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఒక స్వర్ణం, ఒక రజత పతకం సాధించింది.



సాధనలో 'గురు'

శనపతి గురునాయుడు సాధనలో మేటి. అదే నేడు విజయాలను అందిస్తోంది. 2020 యూత్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2021 యూత్ నేషనల్స్‌లో స్వర్ణం, 2022 యూత్ నేషనల్స్‌లో స్వర్ణం, 2022 జూనియర్ నేషనల్స్‌లో రజతం, 2023 జాతీయ స్థాయి యూత్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం, 2023 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో స్వర్ణం, 2023 యూత్ వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం, 2023 ఆషియన్ యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్, 2023 కామన్వెల్త్ యూత్ వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్, 2023 కామన్‌వెల్త్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ పతకాలను సాధించాడు.

విజయ 'లక్ష్మి'



చుక్కా శ్రీలక్ష్మి 2023 కామన్‌వెల్త్ చాంపియన్ షిప్‌లో సిల్వర్, 2023 ఏషియన్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానం, 2023 సీనియర్ నేషనల్ ఇంటర్ స్టేట్స్‌లో సిల్వర్, 2022 యూత్ జూనియర్ జాతీయస్థాయిలో స్వర్ణం, 2021 యూత్ జూనియర్ నేషనల్స్‌లో స్వర్ణం, 2020 యూత్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2020లో యూత్ నేషనల్స్‌లో స్వర్ణం, 2019లో స్కూల్ గేమ్స్‌లో సిల్వర్, 2020 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రజతం, 2021 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సిల్వర్, 2022 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో స్వర్ణం, 2023 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది.

విజయమే లక్ష్యంగా..



ఇక్కడ సాధన పొందిన ప్రతీ క్రీడాకారుడు విజయం కోసం పరితపిస్తారు. ఆ స్థాయిలో సాధన చేస్తారు. కష్టమైన క్రీడ అయినా.. యువతీయువకులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణిస్తున్నారు. క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధిస్తున్నారు.

– బూసరి రవికుమార్, కోచ్, కొండవెలగాడ

క్రమశిక్షణాయుత శిక్షణ



వెయిట్‌లిఫ్టింగ్ క్రీడను ప్రాణంగా భావిస్తాం. ఇక్కడి యువతలో కూడా అదే ఆసక్తిని పెంపొందిస్తున్నాం. గ్రామంలో ఉన్న జిమ్‌లో 8 ఏళ్ల వయస్సు నుంచి విద్యార్థులు కఠోర సాధన చేస్తారు. మెలకువలను తెలుసుకుంటారు. ఆ సాధనే నేడు పతకాలను తెచ్చిపెడుతోంది. క్రీడాకారులకు జిల్లా, రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్లు సాయం అందిస్తున్నాయి. మా గురువు శర్మ వద్ద నేర్చుకున్న విద్యను క్రీడాకారులకు పంచిపెడుతుండడం ఆనందంగా ఉంది.

– చల్లా రాము, వెయిట్‌లిఫ్టింగ్ శిక్షకుడు, కొండవెలగాడ

పతకాల 'పల్లవి'



మార్కెట్ కమిటీ కలాసీ లక్ష్మునాయుడు కుమార్తె అయిన.. పల్లవి 2020 ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రజతం, 2022, 23 ఖేలో ఇండియాలో యూత్ గేమ్స్‌లో స్వర్ణం, 2023 ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో స్వర్ణం, 2021 16వ జాతీయస్థాయి యూత్ గేమ్స్‌లో స్వర్ణం, 2021 మహిళ జాతీయ స్థాయి చాంపియన్ షిప్‌లో సిల్వర్, 2022 ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, రెండు సిల్వర్, 2023 ఐడబ్ల్యూఎల్‌ఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణం, 2023 కామెన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జూనియర్ విభాగంలో స్వర్ణం, సీనియర్ విభాగంలో సిల్వర్, 2023 ఏసియన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణ పతకాలను సాధించింది.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ నిషాంత్ కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఫిర్యాదులు వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం: వివిధ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి మొర పెట్టుకుంటున్న అర్జీదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించాను. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 80 అర్జీలు అందాయి. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, జిల్లా సరఫరా అధికారి శివప్రసాద్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పశు వైద్య అధికారి బి.శ్రీనివాస రావు, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతివారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా సెంచూరియన్‌కు నాక్ గుర్తింపు

- చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: ఒడిశా సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి నాక్ ఏ ప్లస్ గుర్తింపు రావడం పట్ల వర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు టెక్కలి వర్సిటీలో సిబ్బందితో కలిసి సోమవారం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం నాలుగు పాయింట్లకు గాను ఒడిశా సెంచూరియన్ విశ్వవిద్యాలయం 3.37 పాయింట్లు సాధించి నాక్ ఏ ప్లస్‌లో నిలిచిందన్నారు. త్వరలో టెక్కలి క్యాంపస్‌కు కూడా నాక్ గుర్తింపు దక్కనుందని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేశారు.



టెక్కలి సెంచూరియన్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న వర్సిటీ ప్రతినిధులు

బైక్, ఆటో ఢీకొని యువతి మృతి



యువతి మృతదేహం వసంతకుమారి (ఫైల్)

సీతంపేట/బూర్జ: సీతంపేట ఏజెన్సీలోని గొయిది గ్రామ సమీపంలో సోమవారం ఓ బైక్, ఆటో ఢీనడంతో జరిగిన ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం గుత్తవల్లికి చెందిన పైడి వసంతకుమారి (17) మృతిచెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుత్తవల్లి పక్కగ్రామానికి చెందిన యువకుడు కూన వెంకటేష్, వసంతకుమారి బైక్‌పై సీతంపేట వచ్చారు. తిరుగుప్రయాణంలో ద్విచక్రవాహనంపై ఇద్దరూ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో గాయాలపాలంగా యువతి అపస్మారక స్థితికి చేరుకుంది. ఇద్దరినీ 108లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే యువతి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువకుడు వెంకటేష్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఒక్కగానొక్క కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు ఉమ, సత్యనారాయణ గుండెలవిసేలా రోదిస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 255 వినతులు



అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి 255 వినతులు అందాయి. కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, పద్మలత తదితరులు వినతులను స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలపై 181 వినతులు అందాయి. తరువాత వరుసలో గ్రామ వార్డు సచివాలయ శాఖకు సంబంధించి 35, గృహనిర్మాణం 10, డీఆర్‌డీఏ 9, పంచాయతీరాజ్ శాఖ 10, పురపాలక శాఖ 7, మిగిలినవి ఇతర శాఖల వినతులు అందాయి. స్పందన అనంతరం అసంతృప్తి వినతులపై కలెక్టర్ సమీక్షించారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని, వారిచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో భాగంగా 35 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు.

బయటకు వచ్చిన టీడీపీ దాడి వీడియో



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుడి దాడి చిత్రాలు

భామిని: మండలంలోని కొరమ గ్రామంలో పొలంలో పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకుల దాడి దృశ్యాల వీడియో బయటకు వచ్చింది. ఈనెల12వ తేదీన గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అగతముడి మోనరావు, అప్పలనాయుడు, వరలక్ష్మి, జానకి, మహేష్‌లపై దాడి జరగ్గా వారంతా తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అయితే ఈ ఘటనలో దాడికి పాల్పడిన టీడీపీ నాయకుల దాష్టీకం, హత్యాయత్నం దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ మేరకు బాధితులు దాడి వీడియోలను పోలీసులకు అందజేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236